ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ప్రతి గింజను కొంటామని ప్రగల్భాలు పలికిన వైసీపీ అన్నదాతలకు మొండిచెయ్యే చూపింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. రైతులకు నడ్డి విరిచిన ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధిచెబుతాం. **- కొండపల్లి సూర్యనారాయణ, రైతు, జె.అన్నవరం, ఏలేశ్వరం**

సాగునీరందక తీవ్ర నష్టాలు...



ఈ ఐదేళ్లలో సాగునీరందక తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాం. తాళ్లూరు పుష్కర లిఫ్టును నమ్ముకుని వ్యవసాయం చేస్తాం. అడపాదడపా వర్షాలు వచ్చినప్పటికీ పంట చేతికొచ్చే సమయంలో సాగునీరందక ఎండిపోతున్నాయి. వైసీపీలో ఎదుర్కొన్న నష్టాలను ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. **- గొల్లపల్లి బుల్లబ్బాయి, రైతు, మల్లేపల్లి**

అరటికి ప్రభుత్వ సహకారం లేదు



ఎన్నో ఏళ్లుగా అరటి సాగు చేస్తున్నా. గతంలో ధర బాగుండి ఎంతో కొంత లాభాలు వస్తుండేవి. గత నాలుగేళ్లుగా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. ప్రతి ఏటా ఎకరానికి రూ.30 వేల నుంచి 40 వేల వరకు నష్టం వస్తోంది. ప్రభుత్వ సహకారం లభించడం లేదు. **- మద్దిపాటి జానకి, అరటి రైతు, తీపర్రు, పెరవలి మండలం**

గోదావరి జిల్లాలంటేనే వ్యవసాయం గుర్తొస్తుంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలు కళ్ల ముందు మెదలుతారు. నిజానికి వ్యవసాయమంటేనే ఏటికి ఎదురీతలాంటిది. పెరిగిపోయిన పెట్టుబడులు, కూలీల కొరత ఓ వైపు, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు, సాగునీటి సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యం ఇంకో వైపు రైతులతో ఆటలాడుతుంటాయి. సాధారణంగా అనేక సమస్యలు చుట్టుముట్టినప్పుడు రైతు ఒడ్డున పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంటుంది. ధాన్యం కొనుగోలు ద్వారా, సాగునీటి సరఫరా ద్వారా ఆదుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు కోల్పోతే పంటల బీమాతో సాయం అందించేందుకు అభయమిస్తుంది. కానీ.. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను నిలువునా ముంచింది. ప్రతి గింజా కొంటున్నామని చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లని నిజమైన రైతులందరికీ ఆదిలోనే తెలిసిపోయింది. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనేసి మద్దతు ధర ఇచ్చేస్తున్నామని చెప్పడమూ అంతే మోసమని తేలిపోయింది. అమ్మిన ధాన్యానికి సొమ్ముల కోసం రైతన్నలు పడిన పాట్లను జన్మలో మర్చిపోలేరు. ఈ మొత్తం వ్యవహారం వెనుక దళారీలు, కొందరు మిల్లర్లు, ప్రభుత్వంలో కీలకమైన ప్రముఖులు ఆడిన నాటకంలో చివరకు దగా పడింది రైతన్నే. గోదావరి జిల్లాల్లో ఏటా సాగు నీటి సమస్యలు తప్పవు. అందుకు ఏ ప్రభుత్వమైనా అటు గోదావరి, ఇటు కాల్వల వ్యవస్థలను ఆధునికీకరణ చేస్తుండడం సర్వసాధారణం. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసింది సున్నా. సాగునీటికి ఈ క్షణం కూడా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల రైతుల పరిస్థితీ ఇంతే. రైతులకు ఈ ఐదేళ్లూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు.. ఐదు వేళ్లూ నోట్లోకి వెళ్లడమే కష్టం మారింది.. అందుకే ఎన్నికల సమయమిది...ఆలోచించాల్సిన తరుణమిది...!!

ఐదేళ్లూ.. నోట్లోకి.. వెళ్లలేదు!

అన్నదాతకు అష్టకష్టాలే..





చివరికింతే : ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెంలో ఏటా ఇంతే

- వైసీపీ సాగు..బాగా లేదు
- అన్నదాతలతో చెలగాటం
- ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకోలేదు
- పలకరింపునకూ నోచుకోలేదు
- ధాన్యం కొనుగోళ్లలో మాఫియా
- ఆధునికీకరణ ఊసేలేదు



సామర్లకోట, ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వం అన్నదాతల జీవితాలతో ఆటలాడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయం చేసే రైతులు గడిచిన ఐదేళ్లలో సాగుకు అష్టకష్టాలు పడ్డారు. ఒకపక్క తుఫాన్లు, అకాల వర్షాలు, వర్షాభావం రైతుల వెన్ను విరిచాయి. పెట్టిన పెట్టుబడులు దక్కక, ప్రభుత్వం ఆదుకోక అన్నదాతలు రోడ్డునపడ్డారు. పంటలు తుడిచిపెట్టుకుపోయి అప్పులపాలయ్యారు. మిచౌంగ్ తుఫాన్‌లో ధాన్యం తడిచి మొలకలు వస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోలేదు. పీకల్లోతు కష్టాల్లో మునిగిన అన్న దాతలను వైసీపీ నాయకులు పలకరించిన దాఖలా ల్లేవ్. వ్యవసాయాధికారులు అరకొర నివేదికలు పంపినా నష్టపోయిన రైతులకు సొమ్ములు పడలేదు. ఏదోలా మిగిలిన వరి పంటను విక్రయించడానికి ప్రయత్నిస్తే అన్యాయమే జరిగింది. వైసీపీ పాలనలో ఐదేళ్లూ..

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎక్కడికక్కడ చేతులెత్తేసింది.ఆర్‌బీకేలకు అన్నదా తలు తెచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కొనకుండా నరకం చూపించింది. ధాన్యం డబ్బులకు ముప్పు తిప్పలు పెట్టింది. తేమ పేరిట ధాన్యాన్ని దళారులకు అమ్ముకునేలా చేసింది.ఇక రబీలో బొండాల రకం ధాన్యం నిషేధం పేరిట నష్టపరిచింది. రైతులకు యంత్ర పరికరాలు మంజూరులో విఫలమైంది. ఈ ఐదేళ్లలో అప్పుల భారం మరింత పెరిగి రైతులకు ఐదువేళ్లూ నోట్లోకి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. పంట కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరించక సాగునీటి ఇబ్బందులే. ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులకు, గోదావరి పరీవాహక ప్రాంత రైతులకు మధ్య నీటి యుద్ధాలు తప్పలేదు. చెరకు పంట వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని చక్కెర పరిశ్రమలు మూతబడ్డాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో నగ్గుబియ్యం తయారీ పరిశ్రమలు సామర్లకోట, పెద్దాపురంలలోనే సుమారు 32 ఉండేవి. దుంప సాగు రైతులకు ప్రభుత్వం నుంచి ఏ సహకారం లేకపోవడంతో ఈ ఐదేళ్లలో సుమారు 18 సగ్గు బియ్యం మిల్లులు మూ తబడ్డాయి. దుంపసాగు కూడా చెరకు సాగు రీతిలోనే కనుమరుగవుతోంది.

అరటి రైతుకు లేదు బీమా ధీమా..

పెరవలి: అరటి గెలలకు రేటు లేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత నాలుగేళ్లుగా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు పది వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తుంటారు. ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి పెడతారు. వెదురు కొనుగోలుకు మరో రూ.50 వేల వరకు ఖర్చు. అంటే సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తారు. గెల ఒక్కింటికీ రూ.200 నుంచి 250 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తే రైతుకు లాభసాటిగా ఉంటుంది. గత నాలుగేళ్లలో గెల ఒక్కటి రూ.100 నుంచి రూ.150 వరకు మాత్రమే ధర పలికింది. కొన్ని సమయాల్లో 100 కంటే తక్కువకే కొనుగోలు చేశారు. దీంతో అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే వైసీపీ ప్రభుత్వం వీరి గోడును పట్టించుకోలేదు. చివరకు బీమా సొమ్ములు తమకు దక్కట్లేదని అరటి రైతులు ఆవేదన చెందుతున్నారు.

నర్సరీ రైతులకు చేసిందేమీ లేదు..





కడియం, ఏప్రిల్ 21: దేశవ్యాప్తంగా పేరొందిన కడియం నర్సరీ రైతులకు వైసీపీ ప్రభుత్వంలో చేసిందేమీ లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో కడియంను ప్రత్యేక హబ్‌గా గుర్తించి నర్సరీ రైతులకు సోలార్ పథకాన్ని అందించేవారు. ఈ మండు వేసవిలో నిరంతర విద్యుత్ అందక నానా అవస్థలు పడుతున్నారు. పాలీహౌస్‌లు, షేడ్ నెట్లు, సబ్సిడీపై సూక్ష్మబిందు సేద్యం, బ్యాటరీ స్ప్రేయర్లు వంటి పథకాలు రాయితీపై అందిన దాఖలాలు లేవు. అయినా ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కడియపులంకలో ఏర్పాటుచేసిన ఎకో టూరిజం కేంద్రం పునాదుల్లోనే ఆగిపోయింది. నర్సరీ రైతులను శాస్త్ర, సాంకేతికంగా అభివృద్ధిపరచాలనే ఉద్దేశంతో వేమగిరి శివారులో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఈ ఐదేళ్లలో నర్సరీ రైతులకు కష్టాలే మిగిలాయి..

జగనన్నా.. ఇలా చేశావేంటన్నా..

బీమా చెల్లించక రైతులు నష్టపోయారు...



ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించకపోవడంతో వర్షాల సమయంలో రైతులు నష్టపోయారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సొసైటీల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీతో రుణాలు ఇచ్చేవారు. ఇప్పుడు ముందుగానే 7 శాతం చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ అందలేదు. టీడీపీ ప్రభుత్వం హెక్టారుకు రూ.20 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేది. జగన్ రూ.25 వేలు అందిస్తామని చెప్పి ఇప్పుడు రూ.15 వేలిస్తున్నారు. ఇటీవల జగన్ బటన్ నొక్కినా రైతులకు ఒక్క రూపాయి జమ కాలేదు.

- మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, అమలాపురం రూరల్

కాల్వలు ఆధునికీకరించక ఇబ్బందే..



పది ఎకరాల వరి పొలం సాగు చేస్తున్నా. మాగాం-అయినాపురం పంటకాల్వ ఆధునికీకరణ సక్రమంగా లేక రబీలో నీటిఎద్దడి ఎదుర్కొన్నాం. ఖరీఫ్‌లో అధిక వర్షాలతో ముంపు వల్ల నష్టపోతున్నాం. నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కౌలు రైతులకు రుణాలందిస్తామని ప్రకటనలు చేస్తున్నా వాస్తవంలో అమలు కావట్లేదు.

- కొప్పుల వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం

ఐదేళ్లుగా..డ్రెయినేజీలకు మోక్షంలేదు..



డ్రెయిన్లలో పూడిక తీసి పంట పొలాలను ముంపు నుంచి కాపాడాలని ఐదేళ్లుగా మొరపెట్టుకుంటున్నాం. అధికారులు ప్రతి ఏటా డ్రెయిన్లను పరిశీలించి పూడికతీతకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెబుతున్నారు. అయినా పని జరగడంలేదు. గత రెండేళ్లుగా సార్వాను వదిలేసుకున్నాం. దాళ్వాలోనూ మురుగునీరు దిగే మార్గం కనిపించక పంట నష్టపోతున్నాం. రైతు సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం డ్రెయిన్లను సకాలంలో ఆధునికీకరించడం లేదు.

- దొనిపాటి నాగేశ్వరరావు, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

బటన్ నొక్కారు సరే.. పరిహారమేదీ..



నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నా. గతంలో సంభవించిన తుఫాన్‌కు మొత్తం పంట నష్టపోయినట్టు అధికారులు నమోదు చేశారు. సీఎం బటన్ నొక్కినా ఇంతవరకూ పరిహారం అందలేదు. అష్టకష్టాలు పడి దాళ్వా పండించాను. ధాన్యాన్ని ఏవిధంగా కొనుగోలు చేస్తారోనని ఎదురు చూస్తున్నా.

- నయినాల కనకయ్యనాయుడు, మామిడికుదురు

తుఫాన్ నష్టమూ ఇవ్వలేదు...



మిచౌంగ్ తుఫాన్ కారణంగా నేను పదెకరాల్లో సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతింది. కోయడానికి కూడా పనికిరాకుండా పోయింది. నష్టపరిహారం అందిస్తామని అప్పట్లో అధికారులు, నాయకులు చెప్పారు. నెల రోజులు అన్నారు.. నేటికీ అతీగతీ లేదు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- గన్ని శ్రీనివాస్, రైతు, పెనికేరు, ఆలమూరు మండలం

- అన్నదాత..ఎదురీత - 6లో

జన కేతనం

గోదారమ్మ ఒడిలో..

ఎన్నో విశేషాల మణిహారం..
పి.గన్నవరం - 6లో

టీడీపీ హయాంలో కళకళ.. వైసీపీ వచ్చాక విలవిల

జగ్గంపేట నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి
ప్రత్యేక కథనం - 7లో

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా రామకృష్ణారెడ్డి?

అభ్యర్థి ఆయనే.. మారనున్న కండువా.. నేడు ప్రకటన

అమలాపురం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా జంగా గౌతమ్

- 7లో

టీడీపీ అభ్యర్థులకు బీఫారంలు అందజేత



కొండబాబుకు బీఫారం అందిస్తున్న చంద్రబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 21: జిల్లాలోని ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ అధినేత చంద్రబాబు ఆదివారం బీఫారంలు అందజేశారు. కాకినాడ సిటీ, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, యనమల దివ్యలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు బీఫారంలు అందజేశారు. పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల అభ్యర్థులు సోమవారం చంద్రబాబు జిల్లా పర్యటనలో బీఫారంలు అందుకునే అవకాశం ఉంది.



బీఫారం అందుకుంటున్న తర్వాత చంద్రబాబుతో సత్యప్రభ, దివ్య

ప్రతి ఓటరు వద్దకు వెళ్లి కూటమి ఆవశ్యకతను వివరించండి

- కాకినాడ పార్లమెంటరీ పరిధిలోని కమిటీ నాయకులతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్



గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసంలో పార్టీ నేతలతో సమావేశమైన పవన్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 21: ప్రతి ఓటరు వద్దకు వెళ్లి జనసేన లక్ష్యాలను, టీడీపీ, బీజేపీతో జనసేన కూటమిగా ఏర్పడిన ఆవశ్యకతను వివరించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసంలో శనివారం రాత్రి, ఆదివారం కాకినాడ పార్లమెంట్ పరిధిలో జనసేన కమిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల తేదీలోగా ప్రజలతో ఎలా మమేకమవ్వాలి, క్షేత్రస్థాయి పరిస్థితులు తదితర అంశాల గురించి పార్టీ నేతలను ఆరా తీశారు. వైసీపీ అరాచక పాలన గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటి ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, తోట సుధీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి కోరుకొండ బహిరంగ సభ ముగించుకుని చేబ్రోలు నివాసానికి చేరుకుని ఆదివారం వరకూ ఇక్కడే ఉన్నారు. సాయంత్రం గొల్లప్రోలు హెలిప్యాడ్ చేరుకుని హెలికాప్టర్ ద్వారా నరసాపురం బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్లారు.

నేడు పదో తరగతి ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల
- జిల్లాలో పరీక్ష రాసిన 27,671మంది విద్యార్థులు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 21: గతనెలలో 18 నుంచి 30 వరకూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేయనున్నారు. పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ విజయవాడలో ఉదయం 11గంటలకు ఫలితాలను విడుదల చేస్తారని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. కాకినాడ జిల్లాలో మొత్తం 27,671మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 13,592మంది బాలురు, 14,079మంది బాలికలు ఉన్నారన్నారు. ఫలితాలను results.bse.ap.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని, ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 99శాతం మంది హాజరయ్యారని తెలిపారు.

యండపల్లిలో నాగబాబుకు ఘన స్వాగతం

- 7లో


అభ్యర్థుల ఖర్చులపై.. నిరంతర నిఘా ఉంచాలి

- ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనా నిగమ్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 21: వ్యయ పరిమితికి మించి ఎన్నికల ప్రచారానికి వెచ్చించే అవకాశం ఉన్న అభ్యర్థుల ఖర్చులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి నీనా నిగమ్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో వివిధ పార్టీల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఆదివారం ఆమె జిల్లా కలెక్టర్ జె.నివాస్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల ప్రలోభాలకు సంబంధించి సీవిజిల్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ జిల్లాలో వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరును వివరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలైన్సు, కంట్రోల్‌రూం, ప్రచారానికి సంబంధించి అనుమతుల వివరాలను వెల్లడించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోసం భద్రత ఏర్పాట్లు, చెక్‌పోస్టుల తనిఖీల వివరాలను ఆమె వివరించారు. ఇప్పటివరకు సీజ్ చేసిన మద్యం, గంజాయి, నగదు వివరాలను వెల్లడించారు. తొలుత ఆమెకు జిల్లా కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో తిప్పేనాయక్‌లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. సమావేశంలో డీఎఫ్‌ఓ భరణి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీపీవో భారతి సౌజన్య, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ సుమతి, అడిషనల్ ఎస్పీ శ్రీలత, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.



నీనా నిగమ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నివాస్



నేడు చంద్రబాబు రాక

జగ్గంపేట బహిరంగ సభకు సర్వం సిద్ధం

జగ్గంపేట, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటకు రానున్నారు. సాయంత్రం భారీ బహిరంగసభకు ఆయన హాజరుకానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.05 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి జగ్గంపేటలోని కొడూరి రంగారావు గ్రౌండ్‌లో హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి సామర్లకోట-గోకవరం రోడ్డు జంక్షన్‌కు చేరుకోనున్నారు. 3.30 గంటల నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 5.10 గంటలకు అక్కడి నుంచి హెలిపాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో విజయనగరం బయలుదేరనున్నారు. జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జగ్గంపేట-గోకవరం రోడ్డులో హెలిప్యాడ్ పనులను తూర్పు ప్రోగ్రాం పరిశీలకుడు హనుమంతరావు పర్యవేక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. బహిరంగ సభ విజయవంతానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చర్యలు తీసుకుంటున్నారు.



రేపు పవన్‌కల్యాణ్ నామినేషన్

గొల్లప్రోలు నుంచి పిఠాపురం వరకు ర్యాలీ.. సాయంత్రం ఉప్పాడలో సభ

పిఠాపురం, ఏప్రిల్ 21: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 23న పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఉదయం పది గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసంనుంచి పవన్ బయలుదేరి గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల మీదుగా ప్రదర్శనగా పాదగయక్షేత్రం వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడినుంచి కాలినడకన పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఆర్వోకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. పవన్ నామినేషన్ ర్యాలీకి తరలివచ్చి, బహిరంగసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి
తూర్పుగోదావరి జిల్లా
సోమవారం 22 ఏప్రిల్ 2024 6

అందరికీ ఆయనే వినాయకుడు



పి.గన్నవరం, ఏప్రిల్ 21: ఏ పార్టీకి చెందిన అభ్యర్థులైన ఆయన ఆశీస్సులు పొందాల్సిందే. విజయాన్ని ప్రసాదించు తండ్రీ..అని ఆయనను వేడుకోవాల్సిందే. అయినవిల్లి వినాయకుడి ప్రత్యేకత ఇది. పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి పార్టీలు ఎవరికి సీటు కేటాయించినా అభ్యర్థి ఎవరైనా సరే ముందుగా అయినవిల్లి వెళ్లి వినాయకుడిని దర్శించుకుంటారు. ఆ తర్వాతే ప్రచారం మొదలుపెడతారు. ఇది సెంటిమెంటుగా వస్తుంది. అలాగే గెలిచిన వెంటనే కూడా ఆయననే దర్శించుకుంటారు.

అన్నదాత ఎదురీత

వైసీపీ పాలనలో కుదేలైన రైతులు



ఏలేరు సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలం

అటు సాగునీటి సమస్య

ఇటు ముంపు

- ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణ జరగక ఇక్కట్లు
- భారీ వర్షాలు కురిస్తే కాలనీలకు కాలనీలు నీట మునక
- వందలాది ఎకరాల్లో పంట నష్టం
- టీడీపీ హయాంలో ఆధునికీకరణ పనులు మొదలు
- జగన్ సీఎం అయ్యాక అవన్నీ నిలిచిపోయిన వైనం
- వైసీపీ పాలనలో రైతులను వెన్నాడిన కష్టాలు



ఏలేరు, సుద్దగడ్డ వరద కారణంగా ముంపునకు గురైన పంట పొలాలు

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 21: ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణపై వైసీపీ పాలకులు చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. జరుగుతున్న ఆధునికీకరణ పనులు నిలిపివేసి అయిదేళ్ల పాలనలో ఒక్క పనీ జరగకుండా చేసిన జగన్ ప్రభుత్వ తీరుపై రైతులు మండిపడుతున్నారు. ఏలేరు, పీబీసీ, సుద్దగడ్డ ఆయకట్టు పరిధిలో వర్షాలు కురవకపోతే సాగునీటి సమస్య, వర్షం కురిస్తే ముంపు బెడద. టీడీపీ హయాంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా రివర్స్ అయింది. జరుగుతున్న పనులను నిలిపివేశారు. ఏలేరు, సుద్దగడ్డ కారణంగా గొల్లప్రోలు పట్టణంలోని కాలనీలతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 25వేల ఎకరాల్లో పంట ముంపునకు గురవుతోంది. ఏ మాత్రం అధికవర్షాలు కురిసినా సుద్దగడ్డకు వరద వచ్చి గొల్లప్రోలు కాలనీలన్ని ముంపునకు గురవుతున్నాయి. ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలయ్యే వరద జలాలు సముద్రానికి చేరే వ్యవస్థ లేకపోవడం సమస్యగా మారింది. దీనికి పరిష్కారం చూపేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.135 కోట్లతో ఏలేరు ఆధునికీకరణ పనులు చేపట్టి 55 శాతం పూర్తి చేశారు. 2019 జనవరి నెలలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ (ఫేజ్-2) కోసం మరో రూ.147 కోట్లు మంజూరుచేసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు రెండేళ్ల వ్యవధిలో పూర్తిచేస్తామని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో తమ కష్టాలు తీరినట్టేనని రైతులు భావించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో జరుగుతున్న పనులను నిలిపివేయడంతోపాటు రెండవ విడతకు పిలిచిన టెండర్లను రద్దు చేశారు. పాదయాత్ర సమయంలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేపడతామని చెప్పిన జగన్ అసలు దానిని పట్టించుకోలేదు. సీఎం హోదాలో గొల్లప్రోలు వచ్చి ఆధునికీకరణకు నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటించిన ఒక్క రూపాయి మంజూరు చేయలేదు. అయిదేళ్ల కాలంలో రైతులు సాగునీటి సమస్య కారణంగా తీవ్రంగా నష్టపోయారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో కాకినాడ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1.07 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. నాలుగేళ్లు దాళ్వా సమయంలోనూ, రెండుసార్లు సార్వా సమయంలో తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడి వరి పంట ఎండిపోయింది. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సుమారు 10 వేల ఎకరాల్లో వరిపంట సాగునీరు అందక ఎండిపోవడంతో పాటు పొలాలు బీటలు వారాయి. పీబీసీ ఆధునీకరణ పనులను విస్మరించడం ఆ ఆయకట్టు రైతులకు శాపంగా పరిణమించింది.

> అన్నదాతల కష్టాలు అన్నీఇన్నీ కావు. 'నేను విన్నాను..నేను ఉన్నాను'.. అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌పై రైతులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. తమ కష్టాలు తీరుస్తారని అనుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏనాడూ రైతులను పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టుల పునర్నిర్మాణం కానీ కాల్వల ఆధునికీకరణ పనులు కానీ ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.



మండపేట: తాపేశ్వరంలో శిథిలావస్థకు చేరిన లాకులు

4 ఏళ్లుగా నత్తనడకన

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పూర్తయ్యేనా?



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ భవనం

సామర్లకోట, ఏప్రిల్ 21: కాకినాడ జిల్లా సామర్లకోట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదల లేక.. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాక ఏడాది కాలంగా అసంపూర్తిగా భవన నిర్మాణం నిలిచిపోయి ఉంది. వ్యవసాయ మంత్రిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నాలుగేళ్ల కిందట మొదలెట్టిన ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు విషయంలో అప్పటి వ్యవసాయ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఆయన స్థానంలో కమిషనర్‌గా వచ్చిన గోపాలకృష్ణ ద్వివేది ఈ ల్యాబ్ నిర్మాణం నిరుపయోగమైందని, దీనికి నిధులు అదనంగా మంజూరు చేయడం దండగని తేల్చేశారు. ఇప్పటివరకూ నిర్మించిన భవనాన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు అప్పగించేయండి అని ఉచిత సలహా ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న ల్యాబ్‌లు నిరుపయోగంగా ఉన్న అంశాన్ని జిల్లా అధికారులు ఎందుకు గుర్తించలేదంటూ అధికారులపై సైతం ద్వివేది ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దాంతో ఈ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయి నిరుపయోగంగా మారింది. కనీసం నిర్మాణం పూర్తిచేసి ఆధునిక వ్యవసాయ పరిశోధన కేంద్రంగా ఏర్పాటుచేసే రైతులకు మంచి జరిగేదని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

సాగునీటి పథకాలకు మంగళం




జెడ్.మేడపాడులో శిథిలావస్థలో లాకులు

మండపేట/ఆత్రేయపురం, ఏప్రిల్ 21: టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఇరిగేషన్‌కు పెద్దపీట వేస్తే ఇప్పటి వైసీపీ ప్రభుత్వం మాత్రం సాగునీటి పథకాలకు మంగళం పాడింది. టీడీపీ ప్రభుత్వంలో 1997లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు సాగునీటి సంఘాలు ఏర్పాటుచేశారు. ఆయన ప్రారంభించిన సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పంట కాల్వలు, మురుగు కాల్వలు ఆధునికీకరణ పనులు చేసేవారు. అనంతరం చంద్రబాబునాయుడు నీరు-చెట్టు పేరిట పథకాన్ని ప్రారంభించి పంటకాల్వల డ్రెయిన్లకు ఇబ్బడిముబ్బడిగా నిధులు అందజేసి ఆధునికీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు డ్రెయిన్ల ఆధునికీకరణకు పెద్దపీట వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2007-08లో డెల్టా మోడర్నైజేషన్ పేరిట భారీగా ఇరిగేషన్ పనులు చేపట్టారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇరిగేషన్ పనులకు సంబంధించి సాగునీటి సంఘాలు, ఇరిగేషన్ శాఖతో పాటు పంటకాల్వలు, డ్రైనేజీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు 2019 నుంచి ఇప్పటివరకు సాగునీటి సంఘాల ఊసేలేదు. పంటకాల్వల ఆధునికీకరణ లేదు. మధ్యలో నిలిచిపోయిన ఇరిగేషన్ కల్వర్టులు, క్వార్టర్స్ పూర్తిచేసిన దాఖలాలు లేవు. కేవలం కోనసీమ జిల్లాలోనే ఉన్న పంటకాల్వల్లో గుర్రపు డెక్క తొలగింపు కోసం ఏటా రూ.కోటి వరకు వ్యయం అవుతుంది. కానీ వీటికి కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయని దుస్థితి. సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు రైతుల అవసరాల మేరకు సంఘాలు ఇరిగేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పంటకాల్వలకు మరమ్మతులు పనులు జరిగేవి. కానీ నేడు ఆధునికీకరణ లేదు. ఇరిగేషన్ గురించి ఐదేళ్లలో ప్రస్తావనేలేదు. మురుగుకాల్వల ఆధునికీకరణ లేకపోవడం వల్ల తుఫాన్లు, వర్షాల సమయంలో భారీగా పంటనష్టం వాటిల్లుతోంది. అటు బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని పట్టించుకున్న దాఖలాలే లేవు. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 16 మండలాలకు సాగునీరు అందించే లొల్ల లాకుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గత ఐదేళ్ల నుంచి కనీస నిర్వహణకు నోచుకోకపోవడంతో శిథిల స్థితికి చేరుకుంది. గతేడాది ఆధునికీకరణకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. ఇరిగేషన్ వ్యవస్థను పటిష్ఠం చేయకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు.




నయినాల గణేశ్వరరావు



నీతిపూడి గణపతిరావు



ఉండ్రు కృష్ణారావు



పులపర్తి నారాయణమూర్తి



అయ్యాజీ వేమా



పాముల రాజేశ్వరి



కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం నియోజకవర్గ చరిత్ర

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి
1962	నయినాల గణేశ్వరరావు(కాంగ్రెస్)	బోడపాటి నరసింహారావు(సీపీఐ)
1967	గెడ్డం మహాలక్ష్మి(కాంగ్రెస్)	నీతిపూడి గణపతిరావు(సీపీఐ)
1972	గెడ్డం మహాలక్ష్మి(కాంగ్రెస్)	నీతిపూడి గణపతిరావు(స్వతంత్ర)
1978	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్(ఐ)	ఎస్.వేములు(జనతా)
1983	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)
1985	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	గంధం రామారావు(కాంగ్రెస్)
1989	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)
1994	ఉండ్రు కృష్ణారావు(టీడీపీ)	నీతిపూడి గణపతిరావు(కాంగ్రెస్)
1996	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)	బత్తుల వెంకటరావు(కాంగ్రెస్)
1999	మానేపల్లి అయ్యాజీ వేమా(బీజేపీ)	కుసుమ కృష్ణమూర్తి(కాంగ్రెస్)
2004	పాముల రాజేశ్వరీదేవి(కాంగ్రెస్)	మానేపల్లి అయ్యాజీ వేమా(బీజేపీ)
2009	పాముల రాజేశ్వరీదేవి(కాంగ్రెస్)	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)
2014	పులపర్తి నారాయణమూర్తి(టీడీపీ)	కొండేటి చిట్టిబాబు(వైసీపీ)
2019	కొండేటి చిట్టిబాబు(వైసీపీ)	నేలపూడి స్టాలిన్‌బాబు(టీడీపీ)






లంక గ్రామాల్లో వరద కష్టాలు (ఫైల్ ఫొటోలు)



డొక్కా సీతమ్మ గారి ఇల్లు



ఆదుర్రులో బౌద్ధ అనవాళ్లు..

అంబాజీపేట కొబ్బరి తియ్యదనం..డొక్కా సీతమ్మ దాన గుణం.. అయినవిల్లి వినాయకుడి ఆశీస్సులు..అప్పనపల్లి బాలబాలాజీ కరుణాకటాక్షాలు.. చారిత్రాత్మక ఆదుర్రు బౌద్ధ స్తూపాలు.. చుట్టూ గోదావరి..ఇలా వ్యవసాయానికి, ఆధ్యాత్మికతకు నెలవు పి.గన్నవరం నియోజకవర్గం.

విభిన్న నియోజకవర్గం

• (పి.గన్నవరం)



పి.గన్నవరం అక్విడెక్టు

పి.గన్నవరం నియోజకవర్గం ఉమ్మడి జిల్లాల్లోనే విభిన్నమైన నియోజకవర్గం. ఈ నియోజకర్గంలో మూడు పక్కలా గోదారే. మూడు మండలాల్లో నదీపరివాహక ప్రాంతం ఎక్కువగా ఉంది. లంక గ్రామాలు ఎక్కువగా ఉండడంతో అధిక శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. కొబ్బరికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధనా కేంద్రం కూడా అంబాజీపేట మండలంలో ఉండడం విశేషం. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలతో పాటు మామిడికుదురు మండలంలోని 11 గ్రామాలను కలుపుకుని గన్నవరం నియోజకవర్గం ఏర్పడింది. సకల విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయకుడు అయినవిల్లి మండలంలో కొలువై ఉన్నాడు. మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి శ్రీబాలబాలాజీ ఆలయం బాల తిరుపతిగా వినతికెక్కింది. అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ నివాసం పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలో ఉంది. మామిడికుదురు మండలం ఆదుర్రులో బౌద్ధుల కాలంలో నిర్మించిన స్థూపం, పి.గన్నవరం అక్విడెక్టు పర్యాటకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొబ్బరి ఉత్పత్తిలో ఏపీ నాలుగో స్థానంలో ఉంది. కొబ్బరి ఉత్పత్తికి సంబంధించి తెగుళ్ల నివారణ, అభివృద్ధి నిమిత్తం ఉభయ రాష్ట్రాలకు గాను ఉద్యానవన పరిశోధనా కేంద్రం ఈ నియోజకవర్గంలోని అంబాజీపేటలో ఉంది.

వరదలొస్తే లంకలు విలవిల

రోజుల తరబడి యాతన

పి.గన్నవరం నియోజకవర్గంలో వరదల సమయంలో లంక గ్రామాలు కన్నీరు పెడతాయి. ఆదుకునే వారి కోసం దీనంగా ఎదురుచూస్తాయి. ప్రతి ఏడాది గోదావరికి వరదల సమయంలో లంక గ్రామాలు రాత్రికి రాత్రే మునిగిపోతాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతారు. ఇంట్లో సామగ్రిని కోల్పోయే వారు కొందరు, పాడి పశువులను కోల్పోయే వారు కొందరు. అలాగే ఎన్నో ఇళ్లు నేలమట్టమవుతాయి. నాయకులు వచ్చి పలకరించి పోతారు తప్పా పరిహారం మాత్రం రాదు. వరదల సమయంలో లంక గ్రామాలకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోతాయి. ఈ సమస్య పరిష్కారానికి తొగరపాయ దగ్గర ఎదురుబిడం కాజ్‌వే, పి.గన్నవరం కె.ఏనుగుపల్లి దగ్గర కాజ్‌వే నిర్మించాల్సి ఉంది. కానీ నాయకులు హామీలు ఇవ్వడం తప్ప వాటిని పూర్తి చేసే వారు లేరు. అలాగే మామిడికుదురు మండలం అప్పనపల్లి వద్ద కాజ్‌వే నిర్మిస్తే వరదల సమయంలో వినాయక ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. అలాగే ప్రతి లంక గ్రామంలోనూ తుఫాన్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఒక్క గ్రామంలో కూడా షెల్టర్ ఏర్పాటు చేయలేదు. వరదల సమయంలో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

నగరం, గన్నవరం నియోజకవర్గాలకు సంబంధించి మొత్తంగా చూసుకుంటే ఏడుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, టీడీపీ-బీజేపీ కూటమిలో భాగంగా ఒక్కసారి బీజేపీ గెలుపొందాయి. 1996లో టీడీపీ ఎమ్మెల్యే ఉండ్రు కృష్ణారావు మృతి చెందారు. మధ్యంతర ఎన్నికల్లో పులపర్తి నారాయణమూర్తి (టీడీపీ) గెలుపొందారు. 2004లో టీడీపీ-బీజేపీ కూటమిలో భాగంగా టీడీపీ నుంచి పులపర్తికి సీటు దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో త్రిముఖ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి పాముల రాజేశ్వరీదేవి అనూహ్యంగా గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ పోటీలో ఉండడంతో త్రిముఖ పోరు నెలకొని రాజేశ్వరీదేవిని ఎమ్మెల్యే పీఠం వరించింది. 2019లో త్రిముఖ పోరులో వైసీపీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు సునాయాసంగా గెలిచారు.

గోదారమ్మ ఒడిలో..

ఎన్నో విశేషాల మణిహారం.. పి.గన్నవరం

1962లో పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేటలోని నాలుగు గ్రామాలను కలుపుకుని నగరం నియోజకవర్గం ఏర్పడింది. 1962లో జనరల్, అపై ఎస్సీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి 2004 వరకు 11సార్లు ఎన్నికలు జరిగాయి. మొట్టమొదటిగా జనరల్ స్థానం నుంచి నయినాల గణేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలంలోని 11 గ్రామాలతో గన్నవరం నియోజకవర్గం ఆవిర్భవించింది. 2009 నుండి 2019 వరకు మూడుసార్లు ఎన్నికలు జరిగాయి.

ఓటర్లు

పి.గన్నవరం నియోజకవర్గంలో 1,96,337 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 98,969, స్త్రీలు 97,363 మంది, ఇతరులు ఐదుగురు. మండలాల వారీగా... మామిడికుదురు 37,532 మంది, అంబాజీపేట 49,424 మంది, పి.గన్నవరం 58,215 మంది, అయినవిల్లి 51,116 మంది ఓటర్లు ఉన్నారు.

అభివృద్ధి లేదు..



పరిశోధన కేంద్రం

ఎన్నికలొస్తే చాలు.. 'దిగుమతి' నాయకుల చూపు పి.గన్నవరం నియోజకవవర్గం వైపే ఉంటుంది. ఇప్పటివరకు సరైన నాయకుడు రాకపోవడంతో అభివృద్ధి వాగ్దానాలు అలాగే మిగిలిపోయాయి. ప్రభుత్వాలు అందించే సంక్షేమం తప్ప గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం. నిరుపేదలకు ఇళ్లు అని చెప్పి గోదారమ్మ ఒడిలో స్థలాలు చూపించి చేతులు దులుపుకున్నారు. ఇంటి స్థలం లేకుండానే గొప్పలు చెప్పుకోవడానికి పట్టాలు పంపిణీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. గ్రోయిన్ల నిర్మాణం జరగలేదు. దీంతో సన్న, చిన్నకారు రైతుల విలువైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. గోదావరి వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మించాల్సిన కాజేవేల ఊసేలేదు. నియోజకవర్గ ప్రధాన కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, కాలనీలను డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. పర్యాటక కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకునే నాథుడే లేదు.

జగ్గంపేట నియోజకవర్గం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. పొలాలకు సాగునీరు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంవల్ల నిరుపయోగంగా మారాయి. నియోజకవర్గంలో ఎటువైపు చూసినా గతుకుల రహదారులు తప్ప నిర్మాణాలు చేపట్టలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులతోపాటు వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, కాపు కల్యాణ మండపం, ఇండోర్ స్టేడియం వంటివి ఎన్నో జగ్గంపేటలో నెలకొల్పేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకున్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలన్నీ మూలనపడ్డాయి. కేవలం టీడీపీ హయాంలో మొదలెట్టారనే కక్షతోనే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా వైసీపీ పూర్తి చేయక పోవడం గమనార్హం.

టీడీపీ హయాంలో కళకళ..
వైసీపీ వచ్చాక విలవిల

- జగ్గంపేట నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి
- సాగునీటి ప్రాజెక్టులు గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- పనిచేయని తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్
- నిలిచిన రామవరం పురుషోత్తపట్టణం ఫేజ్-2
- అభివృద్ధికి నోచుకోని మల్లవరం ఎత్తిపోతల పథకం
- సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు
- నియోజకవర్గంలో ఒక్క రోడ్డూ అభివృద్ధి పరచని ప్రభుత్వం
- లబ్ధిదారులకు అందని టిడ్కో ఇళ్లు..
- పెండింగ్‌లోనే ఇండోర్ స్టేడియం నిర్మాణం


రామవరంలో నిలిపివేసిన పురుషోత్తపట్నం ఫేజ్-2 ప్రాజెక్టు

సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం చేసిన వైసీపీ

జగ్గంపేట, ఏప్రిల్ 21: టీడీపీ ప్రభుత్వం సమకూర్చిన నీటి వనరులను వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయింది. గండేపల్లి మండలం తాళ్లూరులో 2003లో టీడీపీ హయాంలో చంద్రబాబు పుష్కర ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ హయాంలో అది పూర్తయింది. దశాబ్దకాలంపాటు ఈ ప్రాజెక్టు ద్వారా 30వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అయ్యింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి పెట్టకపోవడంతో మోటార్లు మరమ్మతులకు గురవడం, పైపులైన్లు దెబ్బతినడంతో ఒక్క చుక్క నీరు కూడా అందడంలేదు. దీంతో తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనిచేయకుండాపోయింది. పుష్కర జలాలను ఏలేరుకు అనుసంధానం చేస్తూ జగ్గంపేట మండలం రామవరంలో రూ.600కోట్లతో ఏర్పాటు చేసిన పురుషోత్తపట్నం ఫేజ్-2 ప్రాజెక్టును వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలుపుదల చేసింది. దీంతో జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండల రైతులకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. రూ.130కోట్లతో మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని టీడీపీ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంతో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఎక్కడ పైపులైన్లు అక్కడే ఉండిపోయాయి. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. పుష్కర జలాలు అందకపోవడంతో మెట్టప్రాంతమైన గుర్రప్పాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, నరేంద్రపట్నం, బావారం గ్రామాలకు నీరందక తొలకరి పంటలు మధ్యలోనే ఎండిపోయాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. 2023లో సార్వా, 2024లో దాళ్వా పంటను కొనుగోలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ముందుకు రాలేదు. 2023లో అకాల వర్షాల కారణంగా పంటలు తడిసిపోతే జ్యోతుల నెహ్రూ గ్రామాల్లో పర్యటించి కలెక్టర్‌తో మాట్లాడితే కానీ పంట కొనుగోలు చేయలేదు ఈ వైసీపీ ప్రభుత్వం.


జగ్గంపేట మండలంలో సాగునీరందక ఎండిపోయి బీడువారిన భూమి

అభివృద్ధికి అడ్డుపడిన వైసీపీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో జగ్గంపేట పట్టణంలో 3600మందికి సొంతింటి కల నెరవేర్చేందుకు టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లను గాలికొదిలేసింది. జగ్గంపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి పరచాలని టీడీపీ సన్నాహాలు చేసి గండేపల్లి మండలం జడ్.రాగంపేటవద్ద వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ నిర్మాణ పనులు కాస్తా నిలిచిపోయాయి. టీడీపీ హయాంలోనే నిర్మించిన కాపు కల్యాణ మండపం వైసీపీ ప్రారంభించినా సరే దాన్ని పూర్తి వాడకంలోకి తీసుకురాలేకపోయింది. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టీడీపీ చర్యలు తీసుకున్నా వైసీపీ ప్రజాప్రతినిధులు దాన్ని తుంగలోకి తొక్కేశారు.


అధ్వానంగా ఉన్న రాజపూడి-మన్యంవారిపాలెం రోడ్డు

ఒక్క రోడ్డు అభివృద్ధి చేయలేదు

టీడీపీ హయాంలో సర్వీస్ రోడ్లు, సీసీ రోడ్లు, మెయిన్‌రోడ్లను అభివృద్ధి చేశారు. ప్రతి గ్రామం, ప్రతి వీధిలో రోడ్డు సదుపాయం ఉండేలా టీడీపీ చర్యలు తీసుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క రోడ్డును అభివృద్ధి చేయలేకపోయింది. గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన అడపాదడపా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంది తప్ప పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదు. జగ్గంపేట మండలంలోని కొత్తూరు-బలభద్రపురం, కృష్ణాపురం-మన్యంవారిపాలెం, రాజపూడినుంచి మన్యంవారిపాలెం, రామవరం-గోనేడ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి.



తొలకరికి నీరందక ఎండిన పంటలు

-రైతు చిత్రపు వీరవెంకటేశ్వర్లు, సన్నకారు రైతు

రైతుకు కావాల్సింది ముందుగా సాగునీరు. వైసీపీ ప్రభుత్వం తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి సాగునీటిని అందించలేకపోయింది. సాగునీరందక తొలకరి పంటలన్నీ సగంలో ఎండిపోయాయి. ఎకరానికి రూ.50వేలు నష్టం వాటిల్లింది. నీరందక రైతులంతా నష్టపోయారు.

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా రామకృష్ణారెడ్డి?

- ఐక్యంగా ముందుకెళుతున్న కూటమి
- అభ్యర్థి అతనే మారనున్న కండువా
- నేడు స్పష్టమైన ప్రకటన


రామవరంలో నల్లమిల్లితో చర్చిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) ఏప్రిల్ 21/అనపర్తి: కూటమి సమన్వయంతో వెళుతుందనడానికి అనపర్తి టికెట్ ఉదాహరణ. ఎక్కడికక్కడ.. ఒకరికొకరు సర్దుకుపోతూ ఐక్యత చాటుతున్నారు. అనపర్తి సీటు విషయంలో టీడీపీ-బీజేపీ ఒక ఒప్పందానికి వచ్చినట్టు సమాచారం.ఈ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేయనున్నారు. తొలి జాబితాలోనే టీడీపీ అభ్యర్థిగా ఆయన పేరును చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ పొత్తులవల్ల బీజేపీకి అనపర్తి సీటు వెళ్లిపోయింది. దీంతో అనపర్తి బీజేపీ అభ్యర్థిగా కృష్ణంరాజును ప్రకటించారు. కానీ ఇక్కడ బలమైన నేతగా ఉన్న రామకృష్ణారెడ్డి వర్గం తీవ్ర అసంతృప్తికి గురికావడంతో పాటు, ఇక్కడ బలహీనంగా ఉంటే లోక్‌సభ సీటుపై కూడా ప్రభావం చూపుతుందని కూటమి భావించింది. ఈ సీటు మార్పునకు ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు టీడీపీ అభ్యర్థిగా ప్రకటితమైన, సీనియర్ టీడీపీ నేత రామకృష్ణారెడ్డికి బీజేపీ కండువా కప్పి కూటమి అభ్యర్థిగా బరిలోకి దించడానికి నిర్ణయం తీసుకున్నారు. మా కుటుంబం 40 ఏళ్ల నుంచి టీడీపీ గుర్తుతోనే రాజకీయాలు చేస్తోందని రామకృష్ణారెడ్డి మొదట వ్యతిరేకించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యం చేసుకుని శనివారంరాత్రి స్వయంగా రామకృష్ణారెడ్డికి ఫోన్‌చేసి కూటమిలో అందరూ ఒకటే. పైగా నీవు కావాలని పార్టీ మారలేదు. కూటమి నేతలంతా చెబుతున్నారు కదా! ధైర్యంగా ముందుకెళ్లండని చెప్పడంతో రామకృష్ణారెడ్డి ఒకే చెప్పేశారు. కేడర్‌ను పిలిచి మరీ చెప్పేశారు. ఇదే సమయంలో బీజేపీ అధిష్ఠానం కూడా అక్కడ బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజుకు సమాచారం తెలియజేసింది. దీంతో అనపర్తి బీజేపీకే ఉంది. టీడీపీ నేతే ఇక్కడ అభ్యర్థి అయ్యారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తన ప్రచార రథాలపై రామకృష్ణారెడ్డి ఫొటోను ఇప్పటికే పెట్టేయడం గమనార్హం. ఇక కొన్ని లాంఛనాలు జరగవలసి ఉంది. రామకృష్ణారెడ్డి పేరును జిల్లా కమిటీ ప్రతిపాదించి, రాష్ట్ర కమిటీకి పంపడం, అక్కడ నుంచి కేంద్ర కమిటీకి వెళ్లడంతో రేపోమాపో అధికారికంగా ప్రకటన వస్తుంది. 23వతేదీనరామకృష్ణారెడ్డి నామినేషన్ వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం : నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 21 : చంద్రబాబు నిర్ణయం మేరకు తాను పనిచేస్తానని హామీ ఇచ్చానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామవరంలోని నల్లమిల్లి నివాసానికి ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు చేరుకుని నల్లమిల్లితో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కొద్దిసేపు చర్చించారు. నల్లమిల్లి కుటుంబంతో తనకు ఉన్న సాన్నిహిత్యంతో ఈ రోజు రామకృష్ణారెడ్డి కలిసేందుకు వచ్చానన్నారు. కూటమి అభ్యర్థిగా అనపర్తిలో నల్లమిల్లి పోటీ చేస్తారని బీజేపీ తరఫున నల్లమిల్లి విజయానికి ప్రచారం చేస్తామన్నారు. సీటు విషయంపై సోమవారం స్పష్టమైన ప్రకటన వస్తుందన్నారు. నల్లమిల్లి వెంట ఆయన తనయుడు మనోజ్‌రెడ్డి ఉన్నారు.

'రైతాంగంపై బ్యాంక్‌రుణాల వేధింపులు ఆపాలి'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 21: జిల్లాలోని రైతాంగంపై బ్యాంక్‌రుణాల వేధింపులు నిలుపుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా కమిటీ అధికారులకు విజ్ఞప్తి చేసింది. ప్రత్తిపాడులోని మున్సిబ్ వారి రామాలయం వద్ద ఆదివారం భారతీయ కిసాన్‌సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీకాంత్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు సింగిలిదేవ్ అప్పారావు, బీకేఎస్ జిల్లా కార్యదర్శి రాసంశెట్టి రాజా మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం బ్యాంకుల నుంచి బంగారంపై రుణాలు తీసుకున్న రైతులు వెంటనే బకాయిలుకట్టాల్సిందేనని లేకపోతే బంగారంవేలం వేస్తామని బ్యాంకు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వ్యవసాయ దిగుబడులు తగ్గడం, తుపాన్ వల్ల పంట నష్టాలు ఎదురవడం వంటి పరిస్థితుల్లో ప్రస్తుతం బ్యాంకు రుణాలు చెల్లించడంలో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నామని రెండో పంట దిగుబడులు విక్రయించి బ్యాంకు రుణాలు కట్టేస్తామని చెబుతున్నా అధికారులు వినడం లేదని రైతులు తెలిపారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుని రైతుల రుణాల చెల్లింపులో వెసులుబాటు చెల్లించాలని వారు కోరారు. రైతు ప్రతినిధులు బేరి రాము, ఎ.సురేఖ తదితరులున్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ

రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జిల్లా జాయింట్ సెక్రటరీ వేములకొండ జోగారావు

జగ్గంపేట, ఏప్రిల్ 21: బ్రాహ్మణులకు ఎంతో మేలు చేకూర్చిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జిల్లా జాయింట్ సెక్రటరీ వేములకొండ జోగారావు అన్నారు. జగ్గంపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక పూజారులపై దాడులు పెరిగిపోయాయని, బ్రాహ్మణులకు ఒక్క పథకం అమలు కాలేదని ఆరోపించారు. సమావేశంలో బ్రాహ్మణసంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు వివిబి ప్రసాద్‌రావు, మండల అధ్యక్షుడు పిటి ప్రసాద్ పాల్గొన్నారు. యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఇటీవల జరిగిన ఓ వివాహంలో పురోహితుడు ఆ చెల్ల సూర్యనారాయణమూర్తి శర్మను కొంత మంది ఆకతాయిలు దుర్భాషలాడుతూ అవమానపరడాన్ని ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అర్చక పురోహిత విభాగం నుంచి మామిళ్లపల్లి అయ్యప్ప ఓ ప్రకటనలో ఖండించారు. ఇటువంటి నీచమైన పనిచేసినవారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

అమలాపురం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా జంగా గౌతమ్



అమలాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ (ఎస్సీ రిజర్వ్‌డ్) కాంగ్రెస్ అభ్యర్థిగా జంగా గౌతమ్‌ను ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. గౌతమ్ ప్రస్తుతం ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి అత్యల్ప తేడాతో ఓటమి చెందారు. మెగాస్టార్ చిరంజీవితో సన్నిహితంగా పనిచేసిన గౌతమ్ ఆయనతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత అమలాపురం అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా గౌతమ్‌ను కాంగ్రెస్ ఎంపిక చేసింది. 2019లో అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు.

గంజాయి తరలిస్తున్న మైనర్లు అరెస్ట్

గండేపల్లి, ఏప్రిల్ 21: ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్‌లు తునిలో కిలో గంజాయి కొనుగోలు చేసి స్కూటీ డిక్కీలో పెట్టుకుని విజయవాడ వైపు వెళుతుండగా శనివారం రాత్రి తాళ్లూరు దాటిన తర్వాత వాహనాలు తనిఖీల్లో అరెస్ట్ చేశామని గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో

నేడు అపురూప ఘట్టానికి నాంది

● నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ ● త్వరలో స్వర్ణమయం


యాగాలు నిర్వహిస్తూ, ధాన్యాధివాసం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 21 : రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మరో అపురూప ఘట్టానికి నాంది పలకనున్నారు. సుమారు శతాబ్దంపాటు నిలిచిఉండే విధంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా జరుగనుంది. దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చేతులమీదుగా సోమవారం ఉదయం 10.48కి ధ్వజస్తంభ ప్రతిష్ఠ గావిస్తారు. ఈనెల 18 నుంచి చేపడుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రుత్విక్‌లు సర్వదేవతలకు హోమాలు, జపములు, ఆరాధనలు నిర్వహించి ధ్వజానికి ధాన్యాధివాసము గావించారు. చతుర్వేద పండితులు వేదస్వస్తి పలికారు. నేడు ప్రతిష్ఠ అనంతరం త్వరలోనే ధ్వజస్తంభానికి రాగిరేకు అమర్చి దానిపై బంగారుపూత చేయనున్నట్లు దాత తెలిపారు. రూ.4కోట్లు కానున్నట్లు అధికారులు తెలిపారు.

కంట్రోల్ రూమ్ సందర్శన


కంట్రోల్‌రూమ్ పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 21: జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ప్రత్యేక వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆదివారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న సీవిజిల్ విభాగం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సువిధ యాప్ వంటి అన్ని విభా గాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మీడియా సెంటర్‌ను సందర్శించారు. కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఉన్నారు.

జనసేనలోకి చేరిక

జగ్గంపేట, ఏప్రిల్ 21: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆదివారం జనసేనలో చేరారు. గంప శ్రీను, మడగల సత్తిబాబు తదితర నాయకులకు జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ జనసేన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బుదిరెడ్డి శ్రీనివాస్, అయిరాజు, మాదారపు వీరబాబు ఉన్నారు.

ద్వారంపూడి సౌమ్యుడని జగన్ అనడం విడ్డూరం

జగన్‌రెడ్డి ఎలాంటోడో ప్రజలకు అర్థమైపోయింది

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 21: ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఒక అవినీతిపరుడిని, గూండాయిజం, రౌడీయిజాన్ని ప్రోత్సహించి కాకినాడను గంజాయి అడ్డాగా మార్చి పెద్దఎత్తున అవినీతి చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డిని పక్కన పెట్టుకుని సౌమ్యుడని జగన్ అనడం విడ్డూరంగా ఉందని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జగన్నాథపురంలోని కొండబాబు నివాసం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ గజమాలతో ఆయన్ను సత్కరించారు. అనంతరం కొండబాబు మీడియాతో మాట్లాడుతూ ద్వారంపూడిని సౌమ్యుడని అనడం ఎంతో బాధాకర విషయమన్నారు. ఒక శాసనసభ్యుడు అయిఉండి చంద్రబాబు నాయుడును నడిరోడ్డు మీద బూతులు తిట్టిన ద్వారంపూడి ఎలా సౌమ్యుడవుతాడన్నారు. మత్స్యకార కులాన్ని ఎత్తి చూపి అవమానపరిచాడన్నారు. ద్వారంపూడి పెద్దఎత్తున అవినీతి చేశాడని, ఈ ఆరోపణలు ప్రూవ్ అయ్యాయన్నారు. ద్వారంపూడి అవినీతిని బయటపెట్టి వార్తలు రాస్తే ఆ వార్తలకు పాత్రికేయులను లారీ పెట్టి తొక్కించేస్తానన్నాడన్నారు. అలాంటోడ్ని సౌమ్యుడని అనడాన్ని బట్టి జగన్‌రెడ్డి ఎలాంటోడో ప్రజలకు అర్థమైపోయిందన్నారు. 175 నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. జగన్మోహనరెడ్డి విధానాలను చూసిన తర్వాత ఈ కూటమిలోని టీడీపీ పోటీ చేసే చోట సైకిల్ గుర్తుకు, జనసేన పోటీ చేసే చోట గ్లాసు గుర్తుకు, బీజేపీ పోటీ చేసే చోట కమలం గుర్తుకు ఓటేయడానికి జనాలు నిర్ణయం తీసుకున్నారన్నారు. 175 అసెంబ్లీ స్థానాలు, అన్ని ఎంపీ స్థానాల్లో కూటమి నెగ్గుతేందని, జగన్ చిత్తుచిత్తుగా ఓడిపోతాడన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఫౌండేషన్ అధ్యక్షుడు అంగాని శేషగిరి వర్మ, రూరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మండపాక నాగబాబు, ఉపాధ్యక్షుడు కర్రి వీరబాబు, యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.


కొండబాబును గజమాలతో సత్కరిస్తున్న నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ సభ్యులు

కొండబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ

కాకినాడ సిటీ, ఏప్రిల్ 21: టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి వైసీ పీ వెన్నులో వణుకు పుడుతోందని నగర టీడీపీ నాయకుడు నల్లూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 36వ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. డివిజన్ టీడీపీ మహిళా నాయకురాలు నల్లూరి తులసి మాట్లాడుతూ కాకినాడ పార్ల మెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆకెళ్ల ప్రసాద్, మాతంశెట్టి సురేష్ కుమార్, సరగడ విజయలక్ష్మి, పల్ల రామలక్ష్మి పాల్గొన్నారు.


కొండబాబును గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నాగబాబుకు ఘన స్వాగతం

కొత్తపల్లి, ఏప్రిల్ 21: పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం యండపల్లిలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుకు ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వినాయకుడి గుడి సెంటర్ దగ్గర ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన ప్రసంగించారు. వైసీపీ నాయకుల రాక్షసపాలన రాష్ట్రంలో ప్రతిపౌరుడిని విసుగు చెందించిందని, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వంతో అభివృద్ధితో కూడిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. ప్రజలకు సేవ చేయడానికి పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం ఎంచుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం

అధ్యక్షురాలిగా జయలక్ష్మి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 21 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షురాలిగా వి.జయలక్ష్మి ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడలో వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం కార్యవర్గ ఎన్నికలు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన సంఘం అధ్యక్షుడిగా జయలక్ష్మి, జాయింట్ అధ్యక్షుడిగా కె.బృంద, ఉపాధ్యక్షులుగా ఎండీ అమీర్ జానీ, బి.నాగేశ్వరరావు, ఎం. వెంకటలక్ష్మి, కార్యదర్శిగా డి. భైరవమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి కె.నాగబాబు, కె. జై దివ్య, సహాయ కార్యదర్శులుగా ఎం. సందీప్, కృష్ణంరాజు, కోశాధికారి వి.గోవిందరాజు, ఈసీ మెంబర్లుగా శ్రీనివాసరావు, పీఎస్ ప్రసాద్‌తో పాటూ ఆరుగురిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘం కార్యదర్శి డీఎస్ఎన్‌శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా వెన్న రమేష్, పరిశీలకులుగా పీవీ సాయికుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఈవో సంఘం అధ్యక్షుడు వేణుమాధవరావు పాల్గొన్నారు.


ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం

బంధువులు కళ్లల్లో కారం చల్లారు...

కడియం, ఏప్రిల్ 21: తన బంధువులు కిడ్నాప్ చేయబోయారంటూ ఓ యువతి ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా గొడిగనూరు గ్రామానికి చెందిన గంగవరం స్నేహ, కడియం గ్రామానికి చెందిన బత్తిన వెంకటనందులు నరసారావుపేట కళాశాలలో వెటర్నరీ డిప్లమో చదువుకునే సమయంలో ప్రేమలో పడ్డారు. ఈనెల 13న విజయవాడ వెళ్లి కనకదుర్గ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని నందు తల్లిదండ్రులు అంగీకరించారు. స్నేహ తన తల్లిదండ్రులకు కూడా తెలిపారు. ఆదివారం కడియంలోని ఓ ఫంక్షన్‌హాలులో స్నేహ, నందుల వివాహ వేడుకకు స్నేహ బంధు వులు కడియం వచ్చారు. ఈ సమయంలో పద్మావతి, చరణ్‌కుమార్, చందు, ఎస్. భరత్ అనే వారు ఫంక్షన్ హాలులోకి ప్రవేశించి ఫిర్యాదుదారు స్నేహ కళ్లలోకి, ఇతరుల కళ్లల్లోకి కారం చల్లారు. స్నేహను ఆమె భర్త వెంకటనందు రక్షించాడు. ఈ సంఘటనలో బత్తిన వీరబాబు అనే వ్యక్తికి తల, నుదురు, ముక్కుకు గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్నేహ ఫిర్యాదుతో కడియం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 21: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలువద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. పెద్దాపురం మండ లం కట్టమూరు గ్రామానికి చెంది న నాగిరెడ్డి వెంకన్నబాబు(45) మోటార్‌సైకిల్‌పై ఇంటివద్ద నుంచి చేబ్రోలు శివారు సత్తెమ్మతల్లి గుడి వద్ద జరిగే కార్యక్రమానికి బయలుదేరారు. బైపాస్ రోడ్డులోని పెదచెరువు వద్దకు వచ్చేసరికి ఎండతీవ్రతకు అస్వస్థతకు గురై బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన అతనిని 108 అంబులెన్స్‌లో తొలుత పిఠాపురం ఆసుపత్రికి, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని మృతిచెందిన నాగిరెడ్డి

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఎండలతో ఉక్కిరిబిక్కిరి

తుని రూరల్, ఏప్రిల్ 21: మే నెల రాకముందే ఎండలు మండుతున్నాయి. 40 డిగ్రీలు పైబడిన ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం ఉధృతం చేయాలని భావిస్తున్న రాజకీయ పార్టీలకు ఎండ తీవ్రత అడ్డంకిగా మారింది. పగటి వేళ ప్రచారానికి వెళ్లాలంటే వెనుకడుగు వేస్తున్నారు. పార్టీశ్రేణులతో ప్రచారానికి వెళ్లాలని అభ్యర్థులు భావిస్తున్నా ఎండ తీవ్రతకు కార్యకర్తలు ముఖం చాటేస్తున్నారు.

టీడీపీ హయాంలో రూ.2,800కోట్లతో అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలు రూరల్: వన్నెపూడి ప్రచారంలో వర్మ

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 21: టీడీపీ ప్రభుత్వ హయాంలో పిఠాపురం నియోజకవర్గాన్ని రూ.2,800కోట్లతో అభివృద్ధి చేసినట్టు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లును గాజుగ్లాసు గుర్తుపై వేసి జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ ప్రజలకు కరపత్రాలను అందజేశారు. వన్నెపూడిలో రూ.3కోట్లుతో సీసీ రోడ్లు నిర్మించామని, 150మందికి ఇళ్లస్థలాలు ఇచ్చామని, రాబోయే కాలంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ నేతలు ప్రజాసమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, నాయకులు మొయిళ్ల బుజ్జి, రాంబాబు, కందా శివ, రాసంశెట్టి లోకేశ్వరుడు, మట్టా శ్రీను, చిట్టూరి సుబ్బారావు, గింజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

కొత్తపల్లి, ఏప్రిల్ 21: కొత్తపల్లి సముద్రతీరంలో ఉన్న మత్స్యకార గ్రామాలకు సముద్ర కోత నుంచి రక్షణ కోసం సముద్ర గట్టు (జియోట్యూబ్) నిర్మాణంలో పాటూ మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేయాలని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్టు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. ఆదివారం కొత్తపల్లి మండలం అమీనాబాద్‌లో పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ సముద్ర కోతతో మత్స్యకార గ్రామాలు కనుమరుగైపోయే ప్రమాదం ఉందని, ఈ విషయమై చంద్రబాబు పిఠాపురం పర్యటనలో మత్స్యకారులకు హామీ ఇచ్చారన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమీనాబాద్‌లో నిర్మాణంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామన్నారు. ప్రమాదానికి గురైన బోట్లు, తెగిపోయిన వలల కొనుగోలుకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు అనిశెట్టి సత్యానందరెడ్డి, సీకోటి నానాజీ, మడదా విఘ్నేష్, కోడ జగన్నాథం, బాదిన నాగేశ్వరరావు, తిక్కాడ తాతారావు, సూరాడ రాజు, ప్రసాద్ ఉన్నారు.

టీడీపీలో చేరిన శ్రీనివాస్‌కిరణ్



శ్రీనివాస్‌కిరణ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

తాళ్లరేవు, ఏప్రిల్ 21: సుంకరపాలెం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి మోపూరి శ్రీనివాస్‌కిరణ్ మంగళగిరిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో ఆదివారం చేరారు. చంద్రబాబు శ్రీనివాస కిరణ్‌కి టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి స్వాగతించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. దీంతో సుంకరపాలెం, జార్జీపేట, నీలపల్లి, తాళ్లరేవు, ఇంజరం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు అగ్నికుల క్షత్రియులు చేరిక

కోరింగ పంచాయతీ చినవెంకటాయపాలెం గ్రామం నుంచి అగ్నికుల క్షత్రియులు భారీగా సోమవారం టీడీపీలో చేరుతున్నట్టు టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెమ్మాడి కృష్ణవేణి, జిల్లా బీసీసెల్ అధ్యక్షులు వాడ్రేవు వీరబాబు ఆదివారం తెలిపారు. వైసీపీకి చెందిన 100 మంది రాజీనామాలు చేసి బైక్‌లతో మత్స్యకార గ్రామాల్లో ర్యాలీగా తిరుగుతూ తాళ్లరేవు టీడీపీ కార్యాలయంకి చేరుకుని ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమంక్షంలో టీడీపీలో చేరతారని తెలిపారు.

నేడు యనమల దివ్య నామినేషన్

తుని రూరల్, ఏప్రిల్ 21: తుని టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి యనమల దివ్య సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఉదయం అట్టహాసంగా నిర్వహించే నామినేషన్‌కు పార్టీ శ్రేణులు తరలిరావాలని యనమల దివ్య ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

పిఠాపురంలో వంగా గీత..

పిఠాపురం, ఏప్రిల్ 21: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజావారికోటలోని కార్యాలయం నుంచి ఉదయం 10గంటలకు ప్రదర్శనగా మండలపరిషత్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు.

కాకినాడలో ద్వారంపూడి..

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 21: కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉదయం 8.30గంటలకు కాకినాడలో ఆనందభారతి గ్రౌండ్స్ నుంచి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వైసీపీ

» జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

» టీడీపీలో భారీగా చేరికలు

జగ్గంపేట, ఏప్రిల్ 21: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత కూడా వైసీపీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని జగ్గంపేట టీడీపీ-జనసేన-జనసేన కూటమి అభ్యర్థి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ విమర్శించారు. గండూసలికల మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన పలువురు సగరులు, నక్క వెంకన్న, గండికోట సత్యనారాయణ, గండికోట దుర్గారావు, నక్కరెడ్డి, జక్కిశ్రీను, నక్క రామకృష్ణ, గండికోట రామకృష్ణ, సనిబోయిన చిన్న, నక్క అప్పారావు, నక్కఅశోక్, నక్క వీర వెంకట్రావు తదితర 20 కుటుంబాల సగరులు, దళితులు లండ సత్తిబాబు,సేలం వీర్రాజు, శీలం అశోక్, ముంగర నాగేశ్వరరావు, తదితర 12 కుటుంబాల దళితులు జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతుల నెహ్రూ సమక్షంలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దాంట్లో భాగంగానే నీలాద్రిరావుపేట గ్రామం నుంచి సగరులు, దళితులు సుమారు 35 కుటుంబాలు టీడీపీలో చేరడం జరిగిందని, కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. జగన్ ప్రచారానికి వెళ్లిన ప్రతీచోట ప్రజలు తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నీలాద్రిరావుపేట టీడీపీ అధ్యక్షులు కురుకూరి వీర వెంకట చౌదరి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తంగెళ్ళ అప్పారావు, బీసీ నాయకులు నక్క కృష్ణ, యువ నాయకులు ఐవీ రాంబాబు, కందుల భద్రరావు, కురుకూరి శ్రీనివాస్, కురుకూరి రమేష్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారితో జ్యోతుల నెహ్రూ

చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలి : నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 21: జగ్గంపేటలో సోమవారం నిర్వహించే టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోరారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఆయన చేస్తున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సభపై ప్రత్యేక దృష్టి పెట్టి విజయవంతం చేయాలన్నారు. అధిక సంఖ్యలో మూడు పార్టీల శ్రేణులు తరలిరావాలని కోరారు. జగ్గంపేట-కాకినాడ రోడ్డులోని మానేపల్లి పండు స్థలంలో రూ.2లక్షలు ఖర్చుపెట్టి టీడీపీ, జనసేన కార్యకర్తల కోసం చలువపందిరి వేశామని, అక్కడ కార్యాలయం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు 50రోజులకు పైగా నిరవధికంగా ఇదే ప్రాంతంలో దీక్షలు చేపట్టామన్నారు. ఇప్పుడు అదేప్రాంతంలో కార్యాలయం ఏర్పాటు చేశామని, ఈ చలువ పందిరిని చంద్రబాబు ప్రారంభించనున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, జీనుమణిబాబు, సత్తి సదాశివారెడ్డి ఆధ్వర్యంలో ఈ పందిరి నిర్మాణం జరిగిందన్నారు.

బూరుగుపూడిలో టీడీపీ ప్రచారం

కిర్లంపూడి, ఏప్రిల్ 21: బూరుగుపూడి గ్రామంలో ఆదివారం జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పాటంశెట్టి రవి, కుంచే తాతాజీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో సునీత మాట్లాడుతూ నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఓటర్లంతా మంచి నిర్ణయం తీసుకుని సైకిల్ గుర్తుపై ఓటేయాలన్నారు. కార్యక్రమంలో కర్నాకుల పెదకాపు, బాలుకల చిన్నోడు, పాటంశెట్టి విశ్వనాధం, కొండరాజులు, నాగేశ్వరరావు, మూరా సత్తిబాబు, రమేష్, త్రి మూర్తులు, తమ్మారావు, బాబ్జి పాల్గొన్నారు. మండలం తామరాడలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కుటుంబసభ్యులు విచ్చేశారు.



బూరుగుపూడిలో టీడీపీ ప్రచారం చేస్తున్న తోట సునీత

బ్రాహ్మణులంతా సంఘటితంగా ఉండాలి

బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో డాక్టర్ ఐవీరావు



బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐవీ రావు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 21: బ్రాహ్మణులంతా సంఘటితంగా ఉండి రాజకీయ పార్టీలను శాసించే స్థాయిలో ఉండాలని, రోజురోజుకి బ్రాహ్మణులపై పెరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ విద్యుత్నగర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బ్రాహ్మణత్వం ఫౌండర్ ఆర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ మెడికల్ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ, రిటైర్డు డీఎంఈ డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ఉన్న సంఘాలన్నీ ఒకేత్రాటిపైకి వచ్చి సంఘటితంగా ఉండటం ద్వారా హక్కులు సాధించుకోవచ్చన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బ్రాహ్మణులపై దాడులు పెరగడం ఆందోళనకర విషయమని, వీటిని నివారించవలసిని బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. లాయర్ అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులపై దాడులు జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన రీతిలో స్పందించకపోవడం శోచనీయమన్నారు. సమాజహితం కోరే బ్రాహ్మణులపై దాడులు చేయడం దుర్మార్గమని, ఎక్కడైనా దాడులు జరిగితే ముందుగా సంఘాలు స్పందించడం ద్వారా దాడులకు పాల్పడిన వారిపై చర్యలకు అవకాశం ఉంటుందన్నారు. కాకినాడ సిటీ, రూరల్‌లో నియోజవర్గంలో 18 బ్రాహ్మణ సంఘాలు ఉన్నాయని, ఈ సంఘాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి సంఘటితం చేయడం ద్వారా హక్కులు సాధించుకోవచ్చనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణత్వం ఫౌండర్ ఆర్ ప్రభాకర్ తెలిపారు. ఈ 2 నియోజకవర్గాల్లో 7 శాతం ఓట్లు తమ సామాజిక వర్గానికి ఉన్నాయని ఐక్యతగా ఉండి కోర్కెలు సాధించవచ్చన్నారు. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సంఘటనలను ప్రభుత్వ అధినేతల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు విఫలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సంఘం పెద్దలు జమ్మలమడక రామశర్మ, పద్మనాభస్వామి, సీహెచ్. రమణమూర్తి, కందాళ రవి, భమ్మిడిపల్లి మూర్తి, శివమూర్తి, మహాశయా, అనంతలక్ష్మి, కడియాల సత్తిబాబు పాల్గొన్నారు.

టీడీపీ ద్వారాలు తెరిచే ఉంటాయి

నిమ్మకాయల చినరాజప్ప

అచ్చంపేటలో టీడీపీలో చేరికలు



ఎమ్మెల్యే రాజప్పను అభినందిస్తున్న టీడీపీలోకి చేరిన రమేష్, పెదబాబు

సామర్లకోట, ఏప్రిల్ 21: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీతో కలిసి పనిచేసేవారికి టీడీపీ ద్వారాలు తెరిచే ఉంటాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. సామర్లకోట మండలం అచ్చం పేటలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామంలోని మాజీ ఉపసర్పంచ్, వైసీపీ నాయకుడు సలాది రమేష్, గ్రామ వైసీపీ అధ్యక్షుడు వీరంరెడి పెదబాబు తదితర 100 మంది అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, మండల టీడీపీ, గ్రామ టీడీపీ నాయకులు తోటకూర శ్రీనివాస్, వింటి బాబ్జీ, అడ్డాల వెంకన్నబాబుల ఆధ్వర్యంలో ఆదివారం అచ్చంపేటలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరిక సలాది రమేష్, వీరంరెడ్డి వసంతరాయుడు (పెదబాబు) తదితరులకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినం దించారు. పార్టీలో ఇప్పటికే పనిచేస్తున్న సీనియర్లు కొత్తగా చేరినవారని సమన్వయం చేసకుని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి విత్తనాల వెంకటరమణ, రాజా సూరి బాబురాజు క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు తదితర కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమిని గెలిపించడానికి సిద్ధం : రాజప్ప

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమిని గెలిపించడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని, ఆ దిశగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కష్టపడి పనిచేసి అత్యధికమెజార్టీ వచ్చేలా చూడాలని పెద్దాపురం ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజికాభివృద్ధి, సంక్షేమపాలన అందించిన విజన్ గల నాయకుడు చంద్రబాబు అని కీర్తించారు. ఆయన అడుగుజాడల్లో నడవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే వైసీపీ పాలనలో అన్ని విధాలా నష్టపోయిన రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి కూటమి శ్రేణులంతా వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం పనిచేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు.

నేడు చినరాజప్ప నామినేషన్ దాఖలు

పెద్దాపురం/సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా తిరిగి మూడోసారి పోటీచేసేందుకు పార్టీ తరపున ఖరారైన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఈనెల 22న సోమవారం ఉదయం పెద్దాపురం రిటర్నింగ్ అధికారి ఎదుట తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ అచ్చంపేటలోని తన స్వగృహం నుంచి నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి సామర్లకోట మీదుగా పెద్దాపురంలోని క్యాంపు కార్యాలయం చేరుకుంటామన్నారు. అక్కడి నుంచి ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయం చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. నామినేషన్ పత్రాలు దాఖలు అనంతరం జగ్గంపేటలోని చంద్రబాబు పర్యటనకు తరలివెళ్లి చంద్రబాబు చేతులమీదుగా బీఫామ్ స్వీకరించనున్నట్టు ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలు, కూటమి నేతలు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



అచ్చంపేట విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ప్రత్తిపాడు, ఏప్రిల్ 21: ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ బుద్దా సత్యవతిఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ చిలపరశెట్టి వెంకన్నబాబు తదితరులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. స్థానిక తోట వీధిలోని తన నివాసం వద్ద వారికి టీడీపీ కండువాలు వేసి కూటమి అభ్యర్థి సత్యప్రభ పార్టీలోకి ఆహ్వానించారు.



ప్రత్తిపాడులో టీడీపీలో చేరినవారితో వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరంఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో వారంతా వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్ తదితరులున్నారు.

సత్యప్రభ తనయుడు ప్రచారం

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా తనయుడు సాయి తర్షిత్ మండలంలోని రాచపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తండ్రి దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ఆశయ సాధన నియోజకవర్గ అభివృద్ధికి తన తల్లి సత్యప్రభకు సైకిల్ గుర్తుపై ఓటువేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజు, మాజీ సర్పంచ్ దంతులూరి రాజు, రామిశెట్టి మురళీ, గోకవరం సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ

జగ్గంపేట, ఏప్రిల్ 21: జగ్గంపేటలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతాకుమారి, సీఐ లక్ష్మణరావు, సర్కిల్ ఎస్ఐలు పరిశీలించారు. హెలిప్యాడ్, రోడ్‌షో నిర్వహించే ప్రాంతాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

గండేపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పరిశీలించారు. ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతరలో భక్తుల రద్దీ



నూకాలమ్మ

పెద్దాపురం, ఏప్రిల్ 21: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఏ ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పా ట్లను పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు రూ.3 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

మల్లేపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గండేపల్లి, ఏప్రిల్ 21: మండలంలో మల్లేపల్లి జాతీయరహదారి పక్కన వెలసిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాజానగరం మండలం రాయుడుపాకలకు చెందిన ఎస్‌వివి వెంచర్ అధినేత నల్లమిల్లి వెంకన్నబాబు, దుర్గావరలక్ష్మి ఆర్థికసాయంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించి అన్నదానం చేపట్టారు. వెంకన్నబాబు దంపతులను గ్రామ పెద్దలు సత్కరించారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, వైసీపీ యువనాయకుడు తోట రాంజీ వేర్వేరుగా హాజరయ్యారు. అలాగే అన్నపురాజుపేటలో జరిగిన రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠకు జ్యోతుల నెహ్రూ నెహ్రూ హాజరై ఆలయ అభివృద్ధికి రూ.50వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడబాల భాస్కరరావు, ఆంజనేయులు,కొల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

గొల్లప్రోలు, ఏప్రిల్ 21: గొల్లప్రోలులో ఆదివారం రాత్రి సీతారాముల రథోత్సవం వైభవంగా జరిగింది. సీతారామ స్వామి దేవస్థానం(విష్ణాలయం)లో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించిన రథంపై ఉంచారు. విద్యుత్‌దీపాలతో అలంకరించిన రథాన్ని భక్తులు లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మిరుగొట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించగా పలువురుప్రజాప్రతినిధులు రథోత్సవంలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

తుని రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని హంసవరం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 409 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 203 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రవేశ పరీక్షను మోడల్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ సీహెచ్ లలిత సందర్శించారు. ఆమె వెంట చీఫ్‌సూపరింటిండెంట్‌లు, ప్రిన్సిపాల్ పద్మజ ఉన్నారు.

ఒమ్మంగిలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 21: మండలంలోని ఒమ్మంగి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నీరుకొండ వెంకట వీర వెంకట సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని కలుస్తూ కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. పీసీసీ నెంబర్ ధర్నాల కోట శ్రీను, ఓబీసీ కో ఆర్డినేటర్ మొయ్యేటి సూర్యప్రకాశరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొప్పన కోటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ మహిళా కో ఆర్డినేటర్ కె.కుమారి, మండల అధ్యక్షులు మొయ్యేటి నారాయణ, కరణం శ్రీనివాస్, తాతపూడి జార్జి తదితరులున్నారు.

బీఫాం అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థి

గొల్లప్రోలు, ఏప్రిల్ 21: పిఠాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాదేపల్లి సత్యానందరావు ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నుంచి బీఫాం అందుకున్నారు. ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు.

మంచినీటి కోసం ఇబ్బందులు

రౌతులపూడి, ఏప్రిల్ 21: రౌతులపూడి ఆసుపత్రిలో రోగులు తీవ్ర మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో మోటార్, దానికి సంబంధించి 100 మీటర్లు వైరు శనివారం రాత్రి చోరికి గురయ్యాయి. చర్యలు తీసుకుని మంచినీటి కొరత తీర్చి ఆదుకోవాలని రోగులు కోరుతున్నారు.

అరాచక పాలన అంతమే కూటమి లక్ష్యం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ

జనసేనలో శెట్టిబలిజ నాయకుల చేరిక



శెట్టిబలిజ సామాజికవర్గ నాయకులకు జనసేన కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 21: అరాచక పాలన అంతమే కూటమి లక్ష్యమని, ఎన్డీయే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), టీడీపీ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) కోరారు. ఆదివారం రాత్రి రమణయ్యపేట శివారు పాత గైగోలుపాడులో పోతుల బాబూరావు నాయకత్వంలో మలిశెట్టి నరేంద్రకుమార్, పాలిక వేణుబాబు, కోడి చిన సత్తిబాబుల ఆధ్వర్యంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన అంతం కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఏర్పడి పొత్తు పెట్టుకున్నాయన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు ఒరిజినల్, నకిలీవా అన్న విషయం రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. స్వామినగర్‌లో లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలపై తహశీల్దార్‌ను ఆర్టీఐ ద్వారా వివరణ కోరితే తాను ఎటువంటి పట్టాలు జారీ చేయలేదని రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారన్నారు. నకిలీ పట్టాలను ఎమ్మెల్యే ప్రోద్బలంతో స్థానిక వైసీపీ నాయకుడు తయారు చేసి అమ్మేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా సరే ఎన్నికల ముందు రోజు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలిస్తామని ప్రలోభాలకు ఎమ్మెల్యే గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వద్ద సుమారు 800 ఆఫ్‌లైన్ పట్టాలు ఉన్నాయని ఆరోపించారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించి గాజుగ్లాస్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రాయుడు అనిల్, కోడి సత్తిబాబు, పి.శ్రీనివాస్, వాసంశెట్టి నాని, గుత్తుల లీల, మాదబోయిన స్వాతి, పంపన నాగు, కాకరపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం



వేళంగిలో ప్రచారం చేస్తున్న నాయకులు

వేళంగి(కరప), ఏప్రిల్ 21: కూటమి అభ్యర్థుల గెలుపు కోరుతూ మండలంలోని వేళంగిలో ఆదివారం టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జనసేన నేత పంతం సందీప్ ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కూటమి తరపున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలిచిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పంతం నానాజీకి మద్దతుగా నిలిచి గాజుగ్లాసు గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చుండ్రు వెంకన్నరాయచౌదరి, బండారు మురళి, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, గరగ జెమ్మీ, చీపురుపల్లి జయేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దళిత గ్రామాల అభివృద్ధి టీడీపీకే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద

తాళ్లరేవు, ఏప్రిల్ 21: దళిత గ్రామాల అభివృద్ధి టీడీపీకే సాధ్యమవుతుందని, జగన్మోహన్‌రెడ్డి దళితులను కిందకి తొక్కేశారని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద అన్నారు. ఆదివారం పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో టీడీపీనేతలు పూడా వెంకటరామకృష్ణ, సాదనాల వెంకటశివరామకృష్ణల ఆధ్వర్యంలో దళితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం నగరపంచాయతీ మాజీ ఛైర్మన్ చెల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి సహకరించే 27సంక్షేమ పథకాలను రద్దుచేసిందని, మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్‌ను పిచ్చోన్ని చేసి చంపారన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవరును చంపి డోర్ డెలివరీ చేశారని.. దళితులపై దాడులు, కేసులు, అత్యాచారాలు వైసీపీ నేతలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ దళితుల సంక్షేమానికి పాటుపడుతుందని, మే13న జరిగే ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జక్కుల ప్రసాద్‌బాబు, వెంటపల్లి చంద్రమౌళి, మోర్త భైరవమూర్తి, దున్నా సుబ్రహ్మణ్యం, జనిపల్లి ఈశ్వరరావు, రేవు గోవరాజు, దున్నా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.